విద్యార్థిని సాయిప్రీతికి సత్కారం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఏకలవ్య గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని సాయి ప్రీతి అర్చరీ విభాగంలో బంగారు పతకాలు సాధించడంతో ఎమ్మెల్యే పాల్గుణ అభినందించారు. అరకులోయ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యార్థినిని సత్కరించి అభినందించారు. ఆయన మాట్లాడారు ప్రైవేటు బడులకు దీటుగా ప్రభుత్వ బడులను ప్రభుత్వం నడిపిస్తుందన్నారు. ఉన్నత చదువులతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తోందన్నారు. గిరిజన విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. జెడ్పిటిసి సభ్యురాలు జానికమ్మ, మండల అధ్యక్షుడు మలేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సత్కరిస్తున్న ఎమ్మెల్యే

జగనన్నా..హామీల అమలు ఏదన్నా...

- అంగన్‌వాడీలు సమ్మె చేపడుతున్నా పట్టని ప్రభుత్వం
- ఎన్నికల వాగ్ధానాలు మరచిన సిఎం జగన్ - అంతటా ఆగ్రహం

అరకులోలోయలో పిల్లలతో సహా సమ్మె చేపడుతున్న అంగన్‌వాడీలు (ఫైల్)

ప్రజాశక్తి-పాడేరు టౌన్:

అంగన్వాడీల బతుకులు దుర్భరంగా మారాయి. చాలీచాలని వేతనంతో అగచాట్లు పడుతున్నారు. కేంద్రాలకు వచ్చే చంటి బిడ్డల ఆలనా పాలనా, గర్భిణుల, బాలింతల సంరక్షణ లక్ష్యంగా రోజంతా శ్రమిస్తున్నా ప్రభుత్వం ఇచ్చే అరకొర వేతనంతోనే తమ కుటుంబాలను కష్టంగా నెట్టుకొస్తున్నారు.ఉద్యోగ భద్రత కల్పన, అప్పులు చేసి ఖర్చుపెట్టిన బిల్లులు ఇవ్వాలని వంటి సాధారణ సమస్యల పరిష్కారానికి నిరవధిక సమ్మె బాట పట్టారు. జగనన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని నినదిస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం కంటే రూ.వెయ్యి అదనంగా వేతనం చెల్లిస్తామంటూ ఎన్నికల హామీ ఇచ్చిన సిఎం జగన్ నిండా మోసం చేశారని, తమ న్యాయమైన తమ డిమాండ్ల సాధనకు అల్లూరి జిల్లాలోని సమ్మె బాట పట్టామని అంగన్వాడీలు చెపుతున్నారు.అల్లూరి జిల్లాలోని 19 ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో 3214 అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయి. వీటిలో సుమారు 4800 మంది పని చేస్తున్నారు. తమ సమస్యలపై అనేక రూపాల్లో ఆందోళనలు చేసినా వైసిపి ప్రభుత్వం పట్టించుకో లేదు. తొలిసారిగా వైసిపి పాలనలో అంగన్వాడీల సమ్మె సాగుతోంది. వేతనం పెంపుదల, గ్రాట్యూటీ, కేంద్రాల బకాయి అద్దె, ఆయాలకు పదోన్నతి, ముఖ హాజరు యాప్ రద్దు, భీమా, వేతనంలో సగం పెన్షన్ విధానం అమలు..తదితర డిమాండ్ల సాధనే లక్ష్యంగా అంగన్‌వాడీలు ఉద్యమ బాట పట్టారు. అధికారంలోకి రాగానే వీటన్నింటిని అమలు చేస్తామంటూ జగన్ హామీ ఇచ్చారు. నాలుగున్నరేళ్లుగా అమలు చేయకపోవడంతో వైసిపి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా సమ్మెకు దిగారు.

డిమాండ్లు ఇవి..

-అంగన్ వాడీ కార్యకర్త కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలి. గ్రాట్యుటీ అమలు చేయాలి. - కేంద్రాల్లో ఖాళీలన్నింటిని భర్తీ చేయాలి. మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చడంతో పాటు సిబ్బందికి పదోన్నతులు కల్పించాలి. సహాయకులకు పదోన్నతి నిబంధనలు రూపొందించాలి. పదోన్నతి వయోపరిమితి 50 ఏళ్లకు పెంచాలి. రాజకీయ జోక్యం అరికట్టాలి. బీమా సౌకర్యం కల్పించాలి. సర్వీసులో ఉండి ఎవరైనా మృతి చెందితే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలి. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మేను చార్జీలు పెంచాలి. లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు అందించాలి. ప్రీ స్కూళ్లను బలోపేతం చేయాలి. కేంద్రాలకు నేరుగా వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలి. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టిఎ బకాయిలు, ఇతర బిల్లులు వెంటనే చెల్లించాలి. సమావేశాలకు హాజర య్యేందుకు ప్రయాణ ఖర్చులు ఇవ్వాలి. ఎఫ్ఆర్ఎస్ ని రద్దు చేయాలి. అన్ని యాప్స్ ఒకే యాప్‌గా మార్చాలి. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలి. ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలి.

కేంద్రాల అద్దె ఇవ్వలేదు..

కేంద్రాలను నిర్వహించడం భారమవుతోంది.. సకాలంలో సరుకులు ఇతరత్రా పౌష్టికాహారం ఇవ్వరు. లబ్ధిదారులతో చాలా మాటలు పడాల్సి వస్తోంది. కేంద్రాల అద్దె చెల్లించక పోవడంతో యజమానుల నుంచి ఒత్తిడి పెరిగింది. పలు సందర్భాల్లో సొంత డబ్బులను అద్దెలకు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంటుంది. పప్పు దినుసులు, గ్యాస్, కూరగాయల బిల్లులు చెల్లించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి.

ఎస్.అంబిక

యాప్‌లతో పని ఒత్తిడి

పోషణ అభియాన్, పోషణ ట్రాకర్, వైఎస్ఆర్ వంటి యాప్‌లతో నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పని ఒత్తిడి ఎక్కువగా ఉంది తమకు ఇచ్చిన 2జి ఫోన్లతో నరకం చూస్తున్నాం. ప్రతిదీ మొబైల్‌లోనే నమోదు చేయాలి. ఏ చిన్న తప్పు దొర్లిన బాధ్యులను చేస్తున్నారు. కేంద్రాల తనిఖీ పేరిట వేధిస్తున్నారు. ఈ విధంగా చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

ఎస్.చిన్నారి,
పాడేరు మండల కార్యదర్శి
అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

అమలు చేయని వాగ్ధానాలు

తెలంగాణలో ఇచ్చే దానికంటే అదనంగా రూ.వెయ్యి పెంచుతామని వాగ్దానం చేసిన జగన్ అది అమలు జరపలేదు. ఆకాశాన్నంటిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి. 2011 తర్వాత నుంచి వేతనాలు పెరగడం లేదు. వైసిపి ప్రభుత్వ వైఖరితో తప్పని పరిస్థితుల్లో కేంద్రాలకు తాళాలు వేసి రోడ్డుపైకి రావాల్సి వచ్చింది. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె చేస్తాం.

వి.భాగ్యలక్ష్మి,
జిల్లా ప్రధాన కార్యదర్శి
అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

సొంత ఖర్చులతో కేంద్రాలనిర్వహణ

సొంత ఖర్చులతో కేంద్రాలను నిర్వహించే దుస్థితి నెలకొంది. దీంతో, ఆర్థికంగా ఇబ్బంది కలులుగుది. అరకొరగా వచ్చే వేతనాన్ని కేంద్రాలకే పెడితే.. కుటుంబాలను ఎలా పోషించుకోవాలి. ఒక నెల వేతనం ఇస్తే.. మరొక నెల ఇవ్వరు. అన్ని బిల్లులు పెండింగ్‌లో పెడుతున్నారు. దీంతో, కటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారుతోంది. సంక్షేమ పథకాలు వర్తింపజేయలేదు. చాలాకాలంగా అంగన్వాడీల సమస్యలు అపరిష్కృతంగానే మిగిలాయి. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించాలి.

ఎన్.నాగమ్మ, జిల్లా అధ్యక్షులు
అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

మాడగడలో మేఘాల కొండల్లో పాల సముద్రంలా మంచు

మన్యంలో పర్యాటకుల సందడి

- వరుస సెలవులతో పెరిగిన తాకిడి - హోటల్స్, రూమ్స్ హౌస్ ఫుల్

మాడగడలో మంచు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్:ఆంధ్రా ఊటి అరకులోయలో మంచు ముసుగు ఆహ్లాదాన్ని పంచుతోంది. దట్టంగా పొగ మంచు కమ్ముకుంది. అల్లూరి జిల్లా ఏజెన్సీలో దట్టంగా కురుస్తున్న పొగమంచు సోయగాలతో ప్రకృతి అందాలు పులకిస్తున్నాయి. వీకెండ్ కు తోడు క్రిస్మస్ వరుస సెలవు దినాలు కావడంతో పర్యాటక ప్రాంతాలకు టూరిస్టుల రద్దీ అమాంతంగా పెరిగింది.మేఘాల మాడగడ యూ పాయింట్ కు పోటెత్తారు. యూ పాయింట్స్, ఘాట్ రోడ్‌పై పొగమంచును పర్యాటకులు ఆస్వాధించారు. మారిన వాతావర ణాన్ని ఆస్వాదిస్తూ. కెమెరాల్లో బంధిస్తున్నారు. పాడేరు ఏజెన్సీలో చలి తీవ్రత పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. అరకులోయలో 12 డిగ్రి ఉష్ణోగ్రత నమోదైంది. దట్టంగా పొగ మంచు కురుస్తోంది.

బొర్రా గుహల్లో పర్యాటకులు

నృత్యాలతో సందడి..

అరకులోయ మాడగడ యూ పాయింట్స్, ఏపీ టూరిజం, గిరిజన మ్యూజియం లో పర్యాటకులు థింసా నృత్యాలతో సందడి చేస్తున్నారు. ప్రముఖ పర్యాటక కేంద్రమైన గిరిజన మ్యూజియం, పద్మావతి గార్డెన్, చాక్లెట్ తయారీ ఫ్యాక్టరీ, రణజిల్ల వాటర్ ఫాల్స్, డుంబ్రిగూడ చాపరాయి, కాఫీ హౌస్ వద్ద పర్యటకులు పోటెత్తారు. అరకులోయలోని మాడగడ మేఘాల కొండల్లో పాల సముద్రాన్ని తలపించేలా పొగ మంచు కమ్ముకుంది. సుందర దృశ్యాలు చూసేందుకు పర్యాటకులు క్యూ కడుతున్నారు. కొండల మధ్య లోయలో పాల సముద్రం లాంటి మేఘాలను చూసి ఆస్వాదిస్తున్నారు. పొగమంచుతో పాటు చల్లని గాలులు తోడవడంతో ఈ వాతావరణాన్ని పర్యాటకులు ఎంతో ఆస్వాదిస్తున్నారు. సూర్యోదయంలో అద్భుతమైన దృశ్యాలను చూస్తూ సెల్ఫీలలో బంధిస్తూ కేరింతలు కొడుతుంటారు. మాడగడలో పర్యాటకలను ఆకట్టుకునేందుకు ప్రత్యేకంగా దింసా నృత్యాలను ఏర్పాటు చేశారు.

హెటల్స్ రూమ్స్‌లకు డిమాండ్

కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకులు

దారులన్నీ ఏజెన్సీ వైపే..హెటల్ రూములకు భారీ డిమాండ్ పెరిగింది. వందలాదిగా వాహనాలు అరకుకు తరలి వస్తుండటంతో ఘాట్రోడ్లో పలు చోట్ల ట్రాఫిక్ జామ్ పెరిగింది. టూరిస్టులు అధికంగా రావడంతో హెటల్ రూమ్స్ అద్దె గదులకు బాగా డిమాండ్ ఏర్పడింది. దీంతో, హెటల్ యాజమానులు 2000 నుండి ఐదు వేల వరకు భారీగా రేట్లు పెంచారు. లాడ్జిలు దొరక్క ఖాళీ ప్రదేశాల్లో పర్యాటకులు చిన్న చిన్న గుడారాలు వేసుకున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు అద్దె గదులు, హెటళ్లు పూర్తిగా నిండి పోతున్నాయి.

జిమాడుగుల వరుస సెలవులు రావడంతో పర్యాటకులు పోటెత్తారు మండలంలోని కొత్తపల్లి జలపాతం ఆదివారం పర్యాటకులతో కిక్కిరిసిపోయింది చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉదయం సుమారు పది గంటలు సమయమైనా మంచు తెరలు తెలుసుకోలేదు ప్రకతిని ఆస్వాదించడానికి పర్యాటకులు భారీ ఎత్తున ఇతర రాష్ట్రాల నుండి సైతం తరలివచ్చారు దీంతో పలుచోట్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

రద్దీగా ఘాట్ రోడ్డు

అనంతగిరి:ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకుల తాకిడి మరింత రద్దీగా నెలకొంది. ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలతో పాటు ఇతర అందాలను తిలపించేందుకు వేలాది మంది జనాలు తరలి వచ్చారు. ఘాట్ రోడ్, శివలింగపురం, టైడా, డమ్ముకు, ములియగుడ, అనంతగిరి, బీసుపురం, సుంకరమెట రోడ్డులో వాహనాల రద్దీ నెలకొంది. కాపీ ప్లాంటేషన్, సుంకరమెట యూ పాయింట్ ,కాఫి ప్లాంటేషన్‌లు జనాల తాకిడితో కిటకిటలాడాయి. రాపోకల వాహనాలకు గంటల తరబడి ఆలస్యం అవుతోంది.

ఏటిజి.. ఆదివారం బొర్రా గుహల్లో పోటెత్తిన పర్యాటకులు

జిమాడుగుల: వరుస సెలవులు రావడంతో పర్యాటకులు పోటెత్తారు. మండలంలోని కొత్తపల్లి జలపాతం ఆదివారం పర్యాటకులతో కిక్కిరిసి పోయింది. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉదయం సుమారు పది గంటలు సమయమైనా మంచు తెరలు తెలుసుకోలేదు. పర్యాటకులు ఇతర రాష్ట్రాల నుండి సైతం తరలివచ్చారు. దీంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది

'శుభ'కరమైన సేవలందించిన బన్సల్

బదిలీ సబ్‌కలెక్టర్ బన్సల్‌ను సత్కరిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

ప్రజాశక్తి -రంపచోడవరం : రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా శుభం బన్సల్ విశేషమైన సేవలు అందించారని ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నేతలు కొనియాడారు. రంపచోడవరం సబ్‌కలెక్టర్‌గా పనిచేసి, తిరుపతి జెసిగా బదిలీపై వెళ్లిన శుభం బన్సల్‌ను స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రంపచోడవడం ఏజెన్సీ డివిజన్‌లోని ఏడుమండలాల తహశీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు, సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది దుశ్శాలువా వేసి జ్ఞాపికలను అందజేసి ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎపి ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అల్లూరి జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.శ్రీమన్నారాయణ, సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి మడకం సావిత్రి, రంపచోడవరం, మారేడుమిల్లి, వై.రామవరం, దేవీపట్నం తహసీల్దార్‌లు రాజు, చిన్నం శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, సత్య నారాయణ, అసోసియేషన్ యూనియన్ డివిజన్ కార్యదర్శి ఫయాజ్ బాషా (జిలాని) తదితరులు సబ్‌కలెక్టర్‌గా శుభం బన్సల్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే దేవేంద్రుడు, సిసి అజీమ్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి - రంపచోడవరం : స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద రంపచోడవరం సీఐ వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో ఎస్ఐ మోహన్ కుమార్ డ్రంకెన్ డ్రైవ్ వాహన తనిఖీలు నిర్వహించారు ఈ సందర్భంగా సిఐ, ఎస్ఐలు మాట్లాడుతూ, మైదాన ప్రాంతాల నుండి ఏజెన్సీకి వచ్చే పర్యాటకులు మద్యం మత్తులో వాహనాలను నడపడం వల్ల తరచూ ప్రమాదాలకు గురౌతున్నారని, ప్రమాదాలను నియంత్రించేందుకు ముందుజాగ్రత్తగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపినా, వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినా కేసుల నమోదు, జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు

కాంట్రాక్ట్ ఉద్యోగులకు యుటిఎఫ్ చేయూత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: నాలుగు నెలలుగా వేతనాలు లేక అవస్థలు పడుతున్న మండలంలోని విద్యా వనరుల కేంద్రం, వివిధ పాఠశాలల్లో సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు యుటిఎఫ్ మండల శాఖ చేయూతనిచ్చింది. ఆదివారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం వద్ద మండలంలో సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న 13మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఒక్కొక్కరికీ 25కిలోల బియ్యం, రూ15వేలు ఆర్థికసాయాన్ని అందించారు. స్థానిక ఎంపిడిఒ ఎల్ యాదగిరీశ్వరరావు, ఎంఇఒ సూరయ్యరెడ్డి చేతుల మీదుగా యుటిఎఫ్ తమ వంతు బాధ్యతగా వీటిని అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు పైడిమల్లి ప్రధాన కార్యదర్శి రమణ, కోశాధికారి కానెం శ్రీను, గౌరవ అధ్యక్షులు సత్యవతి, అసోసియేట్ అధ్యక్షులు సుబ్బారావు, ప్రసన్న, కుటుంబ సంక్షేమ కార్యదర్శి శ్రీను, పత్రిక కార్యదర్శి శ్రీను, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటలక్ష్మి, జిల్లా కౌన్సిలర్స్ బొజ్జియ్య, రమేష్, గంగరాజు, సిపిఎస్ కన్వీనర్ మూర్తి, పలువురు యుటిఎఫ్ నేతలు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఆర్థిక సాయం చేస్తున్న యుటిఎఫ్ నేతలు

కాటిబోయిన ఆశయసాధనకు కృషి

రాఘవులు స్థూపానికి నివాళులర్పిస్తున్న ఐవి

ప్రజాశక్తి -ఎటపాక : మన్యంలో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కాటిబోయిన రాఘవులు కృషి ఎనలేనిదని, ఆయన ఆశయాల సాధనకు అందరూ పాటుపడాలని సిపిఎం మండల కార్యదర్శి ఐవి పిలుపునిచ్చారు. ఆదివారం చింతలగూడెం గ్రామంలో కాటిబోయిన రాఘవులు 12 వర్ధంతిని నిర్వహించారు. కాటిబోయిన స్థూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐవి మాట్లాడుతూ, ధరలు, పన్నుల భారం, కనీస సౌకర్యాల లేమి, నిరుద్యోగం, పంటనష్టాలు, వేతనాలు అందక కార్మికులు, ఉద్యోగుల అవస్థలు ఇలా సవాలక్ష సమస్యలతో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతుంటే ప్రభుత్వాలు, పాలకులు కనీసం పట్టించుకోవడం లేదన్నారు. ఈ నేపథ్యంలో కాటిబోయిన రాఘవులు వంటి మహనీయుల స్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి సమిష్టిపోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆకిశెట్టి రాము, ఐ.పద్మ పాల్గొన్నారు.

120 కుటుంబాలకు సామగ్రి వితరణ

ప్రజాశక్తి-చింతూరు : విజయవాడ భారత్ వికాస్ పరిషత్, ఎస్‌కెసి ట్రస్ట్ సౌజన్యంతో, చింతూరు సేవాభారతి వారి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని ఎర్రగొండపాకల, కూనవరం మండలం టేకులొద్ది కొండరెడ్డి గిరిజన కుటుంబాలకు వంటపాత్రలు, దుప్పలు, దుస్తులు, నిత్యావసరాలు, తినుబండారాల కిట్లను అందజేశారు.

120 కుటుంబాలకు ఆయాసామగ్రితో కూడిన కిట్లను అందజేశారు. భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షులు ప్రసాద్, కార్యదర్శి వెంకటరమణ, ఫైనాన్స్ సెక్రటరీ జగదీష్ గుప్తా, రామయ్య, మాధవ్, వ వైద్యులు డాక్టర్ గంగాధర ప్రసాద్ పాల్గొన్నారు.

ఆదివాసీలకు అమ్మ ట్రస్ట్ రగ్గుల పంపిణీ

రగ్గులను పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ప్రజాశక్తి- కె.కోటపాడు/అనంతగిరి: అల్లూరి జిల్లా అనంతగిరి మండలం కొత్తూరు పంచాయతీ శివారు కొత్తవలస, తోటవలస గ్రామాల్లో ఉన్న గిరిజనులకు అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రగ్గులు పంపిణీ చేశారు. ట్రస్ట్ కుటుంబ సభ్యులంతా కాలినడకన కొండలపైనున్న ఆయా గ్రామాలకు వెళ్లి 25 కుటుంబీకులకు రగ్గులు అందజేశారు.ఈ సందర్భంగా అమ్మ ట్రస్ట్ ఛైర్మన్ గొంప వెంకటరావు మాట్లాడుతూ చలికాలంలో ఏజెన్సీవాసులు ఎముకలు కొరికే చలిలోపడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, కొందరికైనా చలి నుంచి ఉపశమనం కలిగించాలనే లక్ష్యంతో తమ ట్రస్ట్ ద్వారా రగ్గులు పంపిణీ చేసినటు వెల్లడించారు. ఆయా గ్రామాల్లో విద్య, ఆరోగ్యం ఇతరత్రా అవసరాలపై అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ నిత్యం గిరిజనానికి సేవలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో సూరెడ్డి బాబూరావు, లెక్కల నారాయణరావు, లెక్కల సత్యనారాయణ, దొగ్గ ఎరుకు నాయుడు, మహిళా పోలీస్ లావణ్య, వాలంటీర్ రామకృష్ణ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితునికి విలేకరుల అండ

ప్రజాశక్తి -ఎటపాక : మండలంలోని గన్నవరం గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన బాధితుడు రావి భూషణం కుటుంబానికి ఎటపాక మండలంలోని పత్రికా విలేకరులు ఆదివారం సాయాన్ని అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన బాధితుడు రావి భూషణంకొంత నగదును, నిత్యవసరాలు, కూరగాయలు, దుస్తులను మానవతాదృక్పథంతో సాయం చేశారు. కార్యక్రమంలో విలేకరులు వి శివకుమార్, ఎం శ్రీనివాసరావు, షబ్బీర్, పి.బాలకృష్ణ (ప్రజాశక్తి), పి రాంబాబు, ఆర్ కార్తీక్‌పాల్గొన్నారు.

సాయం అందజేస్తున్న విలేకరులు

కొవ్వొత్తులతో అంగన్‌వాడీల నిరసన

పాడేరులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-యంత్రాంగం

పాడేరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్లు హెల్పర్స్ చేపట్టిన సమ్మె 13వ రోజు ఆదివారం కొనసాగింది. ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారం పట్ల స్పందించక పోవడంతో అంగన్వాడి వర్కర్లు వివిధ రూపాల్లో నిరసన చేపడుతున్నారు. బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు లకే.రాజారావు దీక్షా శిబిరంకు వచ్చి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నారి, జయ, విజయ, ఛాయాదేవి, కుమారి, ఇంద్ర, సత్యవతి, అప్పలమ్మ, కాంతమ్మ,రత్న, కార్మికులు పాల్గొన్నారు.

అరకులోయలో ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఉరి తాళ్లతో నిరసన

అరకులోయ రూరల్: అంగన్వాడి ల తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం చేయాలని చేపట్టిన సమ్మె 13వ రోజుకు చేరింది. ఆదివారం అంగన్వాడిలు, హెల్పర్లు మెడకు ఉరి వేసుకుని వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ నాయకులు లక్ష్మి, వెంకట లక్ష్మీ, భారతి మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం మొండివైఖరిని విడనాడి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కనీస వేతనాలు 26వేలు చెల్లించాలని, తెలంగాణ ప్రభుత్వం కంటే అదనంగా వేతనాలు పెంచాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగమ్మ, రాధ భారతి, నిర్మల, సీత, గౌరమ్మ పాల్గొన్నారు.

పెదబయలు: మండల కేంద్రంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బోండా సన్నిబాబు, అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు టి.రాజమ్మ మాట్లాడుతూ, అంగనవాడీల ఉద్యమాన్ని పక్కదారి మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాల కుటిల ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే అంగన్వాడి సూపర్వైజర్లతో సెంటర్ల తాళాలు పగలగొడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు శాంతి, కొండమ్మ, వరహాలమ్మ, దేవి శాంతి, మంగమ్మ, వరహాలమ్మ, భవాని, సరస్వతి, పద్మ పాల్గొన్నారు.

అనంతగిరిలో సమ్మె

అనంతగిరి : మండల కేంద్రంలో సమ్మె 13 రోజుకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి స్పష్టమైన హామీ ఇవ్వక పోవడంతో వినూత్న రీతిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంగన్వాడీలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ మండల నాయకురాలు సిహెచ్ కళావతి, పి.మంజుల, చిలకమ్మా, కుమారి, అరుణకుమారి పాల్గొన్నారు.

విఆర్.పురంలో కొవ్వొత్తులతో ప్రదర్శన

ముంచింగి పుట్టు: మండలంలోని వనగుమ్మ గ్రామంతో పాటు వివిధ అంగన్వాడి కేంద్రాల్లో13 రోజులకు సమ్మె కొనసాగింది . సమ్మె సందర్భంగా అంగన్వాడి కార్యకర్తలు, అంగన్వాడీ ఆయాలు, మినీ అంగన్వాడీలు లబ్ధిదారులతో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.తులసి, ఎన్.కాంతమ్మ, తులమ్మ, రాధ, రాధికా, పార్వతి, పద్మ, రాజులమ్మ పాల్గొన్నారు.

ఎటపాక : అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా ఎటపాకలో 13వరోజు దీక్షలను ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఐవి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోరాడితే ఎప్పటికైనా విజయం సిద్ధిస్తుందని, కష్టాలు తొలగిపోతాయన్నారు. ఈ సందర్భంగా దీక్షాశిబిరంలో అంగన్వాడీ కొలువులో బాధలు, వారి సమస్యల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యంపై 'లేలే అంగన్వాడీ అక్కా', 'నడిచే గాయమా నారీ లోకమా' అంటూ పలు గేయాలు, నృత్యాలతో ఆడిపాడి ఉత్తేజ పరిచారు.

చెవిలో పూలుతో నిరసన....

విఆర్. పురం : అంగన్వాడీల సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో రేఖపల్లిలో 13 రోజులుగా అంగన్వాడీవర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపడుతున్న అంగన్వాడీలు ఆదివారం ప్రభుత్వ నిరంకుశ విధానాన్ని నిరసిస్తూ చెవిలో పూలు పెట్టుకొని వినూత్నంగా ఆందోళన చేపట్టారు. సిఐటియు జిల్లా నాయకులు జిల్లా సహాయ కార్యదర్శి పూనెం. సత్యనారాయణ, జిల్లా సభ్యులు సున్నం రంగమ్మ మాట్లాడుతూ ఎన్నికలకు ముందుకు అక్కాచెల్లెమ్మలంటూ ఎన్నో హామీలిచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారమదంతో మాటతప్పి చెవిలో పువ్వు పెట్టారన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల కార్యదర్శి నాగమణి పాల్గొన్నారు.

అనంతగిరిలో నిరసిస్తున్న అంగన్‌వాడీలు

సీలేరు: అంగన్వాడీ వర్కర్లు వెల్ఫేర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు వెలగించిన కొవ్వొత్తులతో జికె.వీధిలో నిరసన ప్రదర్శన చేపట్టారు. యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి అప్పల నరస సిఐటియు నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

విఆర్.పురంలో చెవిలో పూలతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

జికె.వీధిలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఎటపాకలో సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు

రాజవొమ్మంగి : అంగన్వాడీల సమ్మెలో భాగంగా యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. యూనియన్ మండల కార్యదర్శి కె వెంకటలక్ష్మి, సిఐటియు నాయకులు పి రామరాజు,టి శ్రీను, సిహెచ్ కుమారి,రత్నం, రాజేశ్వరి,వీరయమ్మ, వీరలక్ష్మి, కన్నమ్మ, రాధ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పట్టుబడిన నిందితులతో పోలీసులు

60 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -హుకుంపేట:- మండలంలోని 60 కేజీల గంజాయితో పాటు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కారును సీజ్ చేసినట్లు స్థానిక ఎస్ఐ సతీష్ తెలిపారు. శనివారం దానిగుమ్మడి జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కారును తనిఖీ చేయగా వెనుక భాగంలో 12 ప్యాకెట్ల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. కారులో ఉన్న మహమ్మద్ నిషావుద్దీన్, క్విజ్జ వహావుద్దిన్, సాయికుమార్‌లను అరెస్ట్ చేసి పాడేరు కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అధిష్టానం ఆదేశిస్తే పోటీకి సిద్ధం

ప్రజాశక్తి-జి.మాడుగుల: అధిష్టానం ఆదేశిస్తే పాడేరు అసెంబ్లీకి తాను సిద్ధమని జనసేన యువ నాయకుడు అంకిత్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్థాపించిన ఆది నుండి కార్యకర్తగా పనిచేస్తున్నానని తెలిపారు..గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అధిష్టానం ఆదేశిస్తే పాడేరు అసెంబ్లీ నియోజకవర్గానికి ఎమ్మెల్యే గా పోటీకి సిద్దం గా ఉన్నానని అంకిత్ తెలిపారు. తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని ఇప్పటికే అధిష్టానానికి దరఖాస్తు చేసినట్టు తెలుస్తుంది.

పాడేరులో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

మన్యంలో క్రిస్మస్ సందడి

ప్రజాశక్తి-పాడేరు: మన్యంలో మన్యంలో క్రిస్మస్ సందడి నెలకొంది. యేసుక్రీస్తు జన్మదినం సందర్భంగా సోమవారం క్రిస్మస్ వేడుకలను జరుపుకునేందుకు క్రైస్తవ సోదరి సోదరులు సంసిద్ధమయ్యారు. క్రీస్తు ప్రార్ధనా మందిరాలను విద్యుత్ దీపాల అలంకరణతో అందంగా ముస్తాబు చేశారు. పట్టణంలోని కారుణ్య ప్రార్ధన మందిరం, క్రీస్తు ప్రార్ధనా మందిరం, బాప్టిస్ట్ చర్చిలు, సెయింట్ ఆన్స్ చర్చిలో ప్రత్యేక అలంకరణలతో తీర్చి దిద్దారు. క్రిస్మస్ సందర్భంగా సోమవారం చర్చిల్లో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం అన్ని చర్చిలలో ప్రార్ధనలు ముగించుకొని పురవీధుల్లో క్రిస్మస్ క్యారల్స్ నిర్వహించారు. యేసుక్రీస్తును స్తుతిస్తూ ఆరాధిస్తూ దింసా నృత్యాలు చేశారు. క్రిస్మస్ తాత శాంతా క్రజ్ వేషాలతో అలరిస్తూ ఈ నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు.

జిమాడుగుల: క్రిస్మస్ పండుగ వేడుకల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. హ్యాపీ హ్యాపీ క్రిస్మస్ అంటూ క్రైస్తవులు నినాదాలు పలికారు. ఈ కార్యక్రమంలో పలు చర్చిల పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి-విఆర్.పురం: మండలంలోని పెద్దమట్టపల్లి పంచాయతీ కేంద్రంలో శనివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ బాధితుడు పండా చిరంజీవిని ఆదివారం టిడిపి నేతలు పరామర్శించారు. శనివారం రాత్రి 9గంటల సమయంలో జరిగిన అగ్నిప్రమాదంలో చిరంజీవి ఇళ్లు పూర్తిగా కాలిపోగా, ఇంట్లోని బీరువా, రెండు కూలర్లు, మంచాలు, దుస్తులు, ఆహారదినుసులు, ఇతర సామగ్రితోపాటు రూ.20వేలు నగదు కాలిబూడిదైంది. బాధితుడిని జెడ్‌పిటిసి వాళ్ల రంగారెడ్డి, తెలుగుదేశం నేతలు పరామర్శించి ఓదార్చారు. బాధితుడిని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బురక కన్నా రావు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి సవలం రాజేంద్ర ప్రసాద్, నియోజక వర్గం వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరక పాల్గొన్నారు.

పెరుగుతున్న కోవిడ్ కేసులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో కోవిడ్ కేసులు క్రమేపీ పెరుగుతున్నాయి. శుక్రవారం నలుగురు, శనివారం ముగ్గురు కోవిడ్ బారిన పడగా ఆదివారం మరో నలుగురికి పాజిటివ్ వచ్చింది. దీంతో మొత్తం కేసుల సంఖ్య 11కు చేరింది. వీరి నుంచి సేకరించిన నమూనాలను జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం పూణె పంపినట్లు ఎఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. వీరికి సోకింది ఏ వేరియంట్ అన్న విషయం నిర్ధారణ కావాల్సి ఉందన్నారు. కాగా, గడిచిన 24 గంటల్లో 24 మందికి పరీక్షలు చేయగా నలుగురికి కోవిడ్ నిర్ధారణ అయింది. వీరిలో కైలాసపురం ప్రాంతానికి చెందిన 51 ఏళ్ల మహిళ ప్రభుత్వ ఊపిరితిత్తుల ఆసుపత్రిలో వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతోంది. ఆమెలో కోవిడ్ లక్షణాలు కనిపించడంతో పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. ప్రస్తుతం ఆమెకు వెంటిలేటర్ మీద చికిత్స అందిస్తున్నారు.

అనకాపల్లి జిల్లాలో ఒక కేసు

సబ్బవరం : అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలంలోని రాయపుర అగ్రహారం గ్రామంలో కోవిడ్ కేసు నమోదైనట్టు పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి ఎస్ఎన్ఆర్.చక్రవర్తి తెలిపారు. మండలంలోని ప్రజలు అప్రమతంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భౌతిక దూరం పాటించాలని, మాస్కులు వినియోగించాలని, శానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసుకోవాలని కోరారు.

ముగిసిన నృత్యోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, కళాభారతి సంవత్సరాంతపు మూడు రోజుల నృత్యోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు కార్యక్రమాలను కళాభారతి అధ్యక్షులు మంతెన సత్యనారాయణరాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, ట్రస్టీ సుసర్ల రామ గోపాల్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రాంభించారు. చివరి రోజు అనకాపల్లి నవ చైతన్య కళా సమితికి చెందిన 60 మంది కళాకారులు అద్భుత ప్రదర్శనలు ఇచ్చారు.

పుంగనూరు చరిత్ర పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రుల చరిత్రలో అంతర్లీనంగా డాక్టర్ ఎం.రామచంద్రారెడ్డి రాసిన 'పుంగనూరు చరిత్ర.. నాతో నేను' పుస్తకాన్ని ఆదివారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో ఆవిష్కరించారు. అంబేద్కర్ యూనివర్సిటీ (శ్రీకాకుళం) మాజీ విసి ఆచార్య హనుమంతు లజపతిరాయ్ ముఖ్యఅతిథిగా హాజరై తొలి కాపీ పుస్తకాన్ని అంతర్మథనం రచయిత డాక్టర్ డివి.సూర్యారావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90 ఏళ్లలోనూ శ్రమించి డాక్టర్ డి.రామచంద్ర రెడ్డి ఆయన జన్మించిన పుంగనూరు చరిత్రను పుస్తక రూపంలో రాసి విస్తృతపరచడం ఆదర్శనీయమన్నారు. శ్రీశ్రీ నడయాడిన విశాఖలో రామచంద్రారెడ్డితో ఉన్న తత్సంబంధం మేరకు ఇక్కడ పుస్తకాన్ని ఆవిష్కరించినట్టు చెప్పారు.

కూరగాయల ధరలు తగ్గుముఖం

ప్రజాశక్తి -సీలేరు: గతవారంతో పోలిస్తే సీలేరు వారపుసంతలో కూరగాయల ధరలు కాస్తా తగ్గుముఖం పట్టాయి. వారపు సంతలో దినసరి కూలీలతో పాటు అన్ని వర్గాల ప్రజలు కూరగాయలు కొనుగోలు చేశారు. అల్లూరి జిల్లా మన్యంతో పాటు మైదాన ప్రాంతంలో కూరగాయలు ఆశాజనకంగా పండడంతో కూనవరం ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు బలిమెల దుప్పిలివాడ ప్రాంత వ్యాపారులు కూరగాయలను సీలేరు వారపుసంతకు తీసుకువచ్చారు. రెండు మూడు నెలలుగా అధిక ధరలుండడంతో సామాన్యులు కొనలేని స్థితి ఉన్నా, ఈ వారంలో అన్నీ కిలో వందరుపాయల లోపే ఉండడంతో కొనుగోలు చేయడం కనిపించింది..కాగ క్యారెట్, బీట్‌రూట్ కిలో రూ.100 వంద పలకడంతో వాటిని కొనుగోలు చేసేందుకు అంతగా ఆసక్తి చూపనప్పటికీ, చిక్కుళ్ళు క్యాబేజీ కాలీఫ్లవర్ కీరదోస పచ్చిమిర్చి పాలకూర కొత్తిమీర తోటకూర ముల్లంగి వంటి కూరగాయలు ధరలు కాస్తా తగ్గడంతో వాటిని కొనుగోలు చేశారు. ఇక టమోటా, ఉల్లి ధరల తగ్గి కొనుగోలుదారులకు కాస్తా ఉపశమనాన్నిచ్చాయి. దీంతో ఇటు కొనుగోలుదారులతోపాటు అటువ్యాపారులు కాస్తా సంతోషాన్ని వ్యక్తం చేశారు.

సీలేరు సంతలో సాగుతున్న కూరగాయల విక్రయాలు

మంచుదుప్పటిలో వారపుసంత, మార్కెట్

సీలేరులో ఆదివారం ఉదయం ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోవడంతో ఉదయం 9:30 గంటల వరకు సీలేరు వారపుసంత,మార్కెట్ మంచుదుప్పటిలోనే ఉంది. చల్లనిగాలులతోపాటు శీతల వాతావరణం జనాన్ని ఉక్కిరిబిక్కిరిచేయగా, ఆ తర్వాత ఎండ కాయడంతో ప్రజలు చలి నుంచి కాస్తా ఉపశమనం పొందారు. విపరీతంగా కురుస్తున్న మంచుతో దినసరి కూలీలు అవస్థలు పడగా, వృద్ధులు, పిల్లలు ఎండెక్కేవరకు ఇళ్లకే పరిమితమయ్యారు.ప్రస్తుతం 20డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలకే ప్రజలు అల్లాడుతుంటే,. రానున్న రోజుల్లో చలి తీవ్రత అధికమైతే పరిస్థితి ఏంటని పలువురు ఆందోళన చెందుతున్నారు

పర్యాటకుల సందడి

సీలేరు వారపు సంతలో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం వారపు సంతలో గిరిజనులు సంతకు తెచ్చిన కూరగాయలు దినుసులు తిలకించి వారి వద్ద నుంచి కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరిచారు. వారి ఆచార సంప్రదాయాలు తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. ఆదివారం సెలవు కావడంతో శనివారం రాత్రి సీలేరు చేరుకొని పలు లాడ్జిల్లో బస చేసిన పర్యాటకులు, ఆదివారం ఉదయం రిజర్వాయర్లు, జల విద్యుత్ కేంద్రం ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో గల బలిమేల రిజర్వాయరు, దారకొండ పరిసర ప్రాంతాల్లో మంచు అందాలు, సహజ సిద్ధమైన ప్రకతి రమణీయమైన దృశ్యాలు తిలకించి, సీలేరు నుంచి బయలుదేరి దారి పొడవునా అందాలను ఆస్వాదిస్తూ లంబసింగి చేరుకున్నారు. అక్కడ పర్యాటకులకు ఏర్పాటు చేసిన గుడారాలు, మంచు అందాలను తిలకించి, అక్కడి నుంచి అరకు, బొర్రా గుహలవైపు వెళ్లిపోయారు ధారాలమ్మ ఘాట్ రోడ్లో జాలువారే జలపాతాలు ప్రకతి అందాలు తిలకించి ఆస్వాదించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులపై నిర్లక్ష్యం తగదు

యుటిఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేద్కర్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ విమర్శించారు. వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు వెంటనే చర్చలకు పిలవాలన్నారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన ధర్నా శిబిరాన్ని ఆయన సంఘం జిల్లా కోశాధికారి కె.రాంబాబుతో కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ సంఘాలతో కలిసి చర్చించే సంప్రదాయాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. ప్రాజెక్టులో ఒకే క్యాడర్‌లో ఉన్న ఉద్యోగులకు రకరకాలుగా వేతనాలు చెల్లిస్తూ కొత్త విధానాలకు తెరతీసిందని తెలిపారు. పార్ట్ టైం పేరుతో తక్కువ జీతాలు ఇచ్చే విధానాన్ని అమలు చేస్తోందని అన్నారు. ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని ఇచ్చిన హామీలను జగన్ విస్మరించారని తెలిపారు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పి.పుండరీకాక్ష, కార్యదర్శి ఎల్.చైతన్య, నాయకులు శ్రీరామమూర్తి, వినోద్, సయిదా సుల్తానా, రాంబాబు, వసుమతి పాల్గొన్నారు.

విశాఖ సర్వతోముఖాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్టు వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. నగరంలోని హనుమంతవాక వద్ద రద్దీగా ఉండే జంక్షన్‌లో త్వరలో. రూ.40 కోట్లుతో ఫ్లైఓవర్ రానుందని వెల్లడించారు. ఎంవిపి కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో జరుగుతున్న క్రెడాయ్ వైజాగ్ ఎక్స్‌పోలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. నగరంలో పచ్చదనం ఆవశ్యకతను వివరించారు. నగరంలో ఇప్పుడు 35 శాతం గ్రీన్ కవర్ ఉందని, 45 శాతం గ్రీన్ కవర్ ఉన్న సింగపూర్‌తో పోటీ పడడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. దీన్ని సాధించడానికి క్రెడాయ్ విశాఖపట్నం ఛాప్టర్ సహకారం చాలా అవసరమని సుబ్బారెడ్డి అన్నారు.

క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న జమాల్ ఖాన్

క్రీడలతో కీర్తి ప్రతిష్టలు

ప్రజాశక్తి.- చింతూరు: క్రీడల్లో రాణించి కీర్తి ప్రతిష్టలు సాధించాలని, ఆటల్లోనే ఆరోగ్యం దాగి ఉందని ప్రముఖ ఆయుర్వేద వనమూలిక వైద్యులు జమాల్‌ఖాన్ అన్నారు. ఆదివారం సకీనా మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నేటి యువత దురలావట్లకు లోనూ అటు సమాజానికి, ఇటు కుటుంబానికి ఇబ్బందికరంగా మారడం విచారకరమన్నారు. బాల్యం నుంచి ఆటలకు దూరమై, పిల్లల్లో ఆరోగ్యసమస్యలు తలెత్తడంతోపాటు ఆయుష్షును కూడా కోల్పోతున్నారన్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించి, క్రీడాస్ఫూర్తితో వ్యక్తిగతంగా తనకు అటు గ్రామానికి, దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు. ఆరోగ్యకరమైన ఆనందకరమైన భావితరాలను అందించాల్సిన కనీస బాధ్యత నేటితరంపై ఉందన్నారు. తన వంతు సాయంగా యువతకు క్రీడాసామగ్రి, ఆర్థికసాయం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అమల, చింతూరు ఎస్ఐ శ్రీనివాస్. కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ అలీ. సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్. ఎర్రంశెట్టి శ్రీనివాసరావు. తెలుగుదేశం నాయకులు ఎండీ.జహంగీర్. మల్లెల్లి వెంకటేశ్వరరావు. వైసిపి నాయకులు రామలింగారెడ్డి. జనసేన మండలాధ్యక్షులు మడివి రాజు, షకీనా సన్స్ అక్బర్. శోకత్ అలీ. హసన్ అలీపాల్గొన్నారు.

ధారాలమ్మ దర్శనానికి పర్యాటకుల తాకిడి

ప్రజాశక్తి - సీలేరు: వరుసగా మూడు రోజులు సెలవులు కావడంతో ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాలల్లో సందర్శకుల సందడి నెలకొంది. జీకే వీధి మండలం దారకొండ ఘాట్ రోడ్‌లో వెలసిన దారాలమ్మ దర్శనానికి ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు తెలంగాణ రాష్ట్రం నుంచి భక్తులు పోటెత్తారు. ధారాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, మొక్కుబడులు తీర్చుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలో వంటవార్పు చేసి చేసి సహఫంక్తి భోజనాలు చేశారు. ధారాలమ్మ ఘాట్‌లోనూ, ఆలయానికి సమీపంలో ఉన్న దార్లగొండి జలపాతాలు, ఆహ్లాదకర వాతావరణం, పచ్చటి చెట్లు ఎత్తైన కొండలు జాలువారే జలపాతాలు నడుమ సందడి చేశారు. దారకొండ గ్రామానికి చెందినఎపి జెన్కో ఉద్యోగి వరప్రసాద్ ధారాలమ్మ అమ్మవారికి మొక్కలు తీర్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా సర్పంచ్ దుర్మరణం

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని పెద్ద గెద్దాడ గ్రామ సమీపంలో ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో మహిళా సర్పంచ్ మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలివి. గంగవరం మండలం జిఎం పాలెం గ్రామ సర్పంచ్ కంగల సుబ్బలక్ష్మి (55) చైతన్యాలు కలిసి మారేడుమిల్లి గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న కౌశిక్‌ను కలిసేందుకు వెళుతుండగా పెద్దగద్దాడ సమీపంలోకి వారు ప్రయాణిస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన సర్పంచ్ సుబ్బలక్ష్మిని రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సుబ్బలక్ష్మి మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన ఆటోడ్రైవర్‌ను రాజమండ్రి ఆసుపత్రికి రిఫర్ చేశారు. మరొకరికి గాయాలయ్యాయి. ఘటనపై రంపచోడవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

27న మేధావుల సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఈ నెల 27న తలపెట్టిన సదస్సును జయప్రదం చేయాలని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి ఆంధ్రప్రదేశ్ కమిటీ చైర్మన్ ఆచార్య హనుమంతు లజపతిరాయ్ కోరారు. డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.